సాక్షి రంగారెడ్డి

సోమవారం । 5 । జూన్ । 2023



నేడు మోకిల ఠాణా ప్రారంభం

శంకర్‌పల్లి - హైదరాబాద్ ప్రధాన రహదారిలో ఏర్పాటు చేసిన మోకిల పోలీస్‌స్టేషన్‌ను సోమవారం అందుబాటులోకి తేనున్నారు. 8లో▸



గీత కార్మికుల సంక్షేమానికి కృషి

గీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్ పేర్కొన్నారు. 8లో▸

30 నుంచి పీజీ ప్రవేశ పరీక్షలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూతో పాటు వివిధ వర్సిటీల్లో పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 30 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ నెల 25 నుంచి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలి. రాష్ట్రవ్యాప్తంగా 15 కేంద్రాల్లో జరిగే ప్రవేశ పరీక్షలకు ఇప్పటి దాకా 35 వేల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు.

న్యూస్‌రీల్

సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ అదృశ్యం



గణపతి (ఫైల్)

పహాడీషరీఫ్: సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లాకు చెందిన ఎం.గణపతి 14 ఏళ్లుగా మామిడిపల్లిలో సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం తోటి ఉద్యోగులు డ్యూటీకి వెళ్లగా గణపతి మాత్రం వెళ్లలేదు. దీంతో ఎస్ఐ శంషీర్‌సింగ్ ఫోన్ చేయగా ఇంటికెళ్లి వస్తానని చెప్పాడు. మరోసారి ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. దీంతో కుటుంబ సభ్యులకు ఫోన్ చేయగా ఇంటికి రాలేదని తెలిసింది. దీంతో ఎస్ఐ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో గానీ, 87126 62367 నంబర్‌లో గానీ సమాచారం ఇవ్వాలని కోరారు.

రైతు బాగుంటేనే రాజ్యం బాగుంటుంది

సంస్కార భారతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు టీవీ రంగయ్య



రైతులను సన్మానిస్తున్న సంస్కారభారతి సభ్యులు

షాద్‌నగర్‌రూరల్: ఎండనక, వాననక ఆరుగాలం కష్టపడి మనకు ఆహారాన్ని అందించే రైతు బాగుంటేనే దేశం బాగుంటుందని సంస్కారభారతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు టీవీ రంగయ్య అన్నారు. ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకొని ఆదివారం సంస్కారభారతి ఆధ్వర్యంలో మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో రైతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనం సామాజికంగా, సాంకేతికంగా ఎంత అభివృద్ధి సాధించినా రైతులు పంటలు పండిస్తేనే మనకు ఆహారం లభిస్తుందన్నారు. కష్టపడి మెతుకులు అందించి, మన బతుకులను కాపాడుతున్న రైతన్నకు కృతజ్ఞతలు చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో సంస్కారభారతి ప్రధాన కార్యదర్శి శివ, సభ్యులు జానకిరాములు, రాజు, రంగనాథం, సింగారం శ్రీనివాస్, వడ్ల రమేష్‌చారి తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల స్వైరవిహారం



వీధి కుక్క దాడిలో గాయపడిన సాయిచరిత్

సుభాష్‌నగర్: నగరంలో పలుచోట్ల ఆదివారం వీధి కుక్కలు స్వైరవిహారం చేశాయి. పలువురిపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. సూరారం డివిజన్ శ్రీరామ్‌నగర్‌కు చెందిన రవి కుమారుడు సాయిచరిత్ (11) ఆదివారం ఉదయం 10.30 గంటల సమయంలో తన ఇంటి ముందు ఆడుకుంటుండగా..అటు నుంచి వెళ్తున్న ఓ పిచ్చికుక్క దాడి చేసింది. బాలుడ్ని వెంబడించి కుడి చేయిని తీవ్రంగా గాయపరిచింది. కుటుంబ సభ్యులు వెంటనే సాయిచరిత్‌ను స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు.

కుషాయిగూడ పరిధిలో..

కుషాయిగూడ: మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్ ఎన్‌టీఆర్‌నగర్‌లో వీధి కుక్కలు స్వైరవిహారం చేశాయి. వేసవి కావడంతో ఇంటి ముందు పడుకున్న వృద్ధులు ఈశ్వరమ్మ, రాజయ్యలపై దాడి చేసిన కుక్కలు పక్కింట్లో మరో ఇద్దరు పిల్లలను కూడా కరిచాయి. ఈ దాడిలో గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కాగా ఈశ్వరమ్మ అనే వృద్ధురాలి తలభాగం, ముఖంపై, శరీరంపై తీవ్రంగా గాయపర్చడంతో ఆమె పరిస్థితి విషమంగా మారింది.

జల దోపిడీ

యథేచ్ఛగా నీటి దందా

- జలాశయాల సమీపంలో బోర్లు
- ట్యాంకర్లలో నింపి తరలింపు
- వాల్టా చట్టానికి తూట్లు
- దర్జాగా ఉచిత విద్యుత్ వినియోగం
- నిద్రమత్తులో అధికారగణం



అజీజ్‌నగర్ సమీపంలో నీళ్లు నింపుకొంటున్న భారీ వాటర్ ట్యాంకర్లు



నీటిని తరలిస్తున్న భారీ ట్యాంకర్

మొయినాబాద్: జల దోపిడీ యథేచ్ఛగా సాగుతోంది. వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తూ అక్రమంగా భూగర్భజలాలను తరలిస్తూ నీటి వ్యాపారం సాగిస్తున్నారు. జంట జలాశయాల సమీపంలో బోర్లు వేసి ట్యాంకర్ల ద్వారా నగరంలో నీటిని విక్రయిస్తూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. నిత్యం వందల సంఖ్యలో ట్యాంకర్లలో నీళ్లు తరలిపోతున్నా అధికారులు పట్టించుకున్న పాపాన పోవడం లేదు. మొయినాబాద్ మండలంలోని అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్ గ్రామాల్లో అక్రమ నీటి దందా జోరుగా కొనసాగుతోంది. హిమాయత్‌సాగర్, గండిపేట జలాశయాల సమీపంలో బోర్లు వేసి భూగర్భ జలాలను తోడేస్తున్నారు. టార్పాలిన్లతో సంపులు ఏర్పాటు చేసి వాటిలో నీటిని నింపుతున్నారు. సంపుల్లో నుంచి వాటర్ ట్యాంకర్లలో నింపి నగరంలోని గచ్చిబౌలి, మణికొండ, కోకాపేట్, నార్సింగి తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో ప్రస్తుతం అపార్ట్‌మెంట్లు, ఇళ్ల నిర్మాణం పెద్ద ఎత్తున జరుగుతుండడంతో నీటి వినియోగం భారీగా పెరిగింది. దీన్ని ఆసరాగా చేసుకుని వ్యాపారులు రెచ్చిపోతున్నారు. జలాశయాల సమీపంలోని రైతుల బోర్లను లీజుకు తీసుకుని వ్యాపారం సాగిస్తున్నారు. నాలుగు నెలలుగా ప్రతి రోజు వందల ట్యాంకర్ల నీళ్లు తరలిపోతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు.

బోర్లకు ఉచిత విద్యుత్..

నీటివ్యాపారానికి వాడుతున్న బోర్లకు అక్రమార్కులు ఉచిత విద్యుత్‌ను దర్జాగా వాడుకుంటున్నారు. వ్యవసాయ బోర్లకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ ఇస్తుండడంతో ఆయా బోర్ల ద్వారానే నీటిని తోడుతున్నారు. తోడిన నీటిని సంపుల్లో నింపి.. సంపుల్లో నుంచి మరో మోటార్ ద్వారా ట్యాంకర్లలో నింపుతున్నారు. సంపుల్లో వాడే మోటార్లకు మాత్రం బిల్లు చెల్లిస్తున్నట్లు తెలుస్తోంది.

భారీ ట్యాంకర్ల ద్వారా..

అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్ రెవెన్యూల్లో నుంచి భారీ వాటర్ ట్యాంకుల ద్వారా నీటిని తరలిస్తున్నారు. ఒక్కో వాటర్ ట్యాంక్ సామర్థ్యం 40 వేల లీటర్లకు పైనే ఉంది. ఇంత భారీ వాటర్ ట్యాంకులు వెళ్తుండడంతో రోడ్లు సైతం దెబ్బతింటున్నాయని స్థానికులు వాపోతున్నారు. అక్రమంగా నీటి వ్యాపారం చేస్తూ నీటిని తరలిస్తున్నవారిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం

బోర్లు వేసి భూగర్భ జలాలను తోడి అమ్ముకుంటూ వ్యాపారం చేయడం వాల్టా చట్టానికి విరుద్ధం. హిమాయత్‌సాగర్, గండిపేట జలాశయాల సమీపంలో నుంచి బోర్ల ద్వారా నీటిని తోడి తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటాం.

– అశోక్‌కుమార్, తహసీల్దార్, మొయినాబాద్

బదిలీలకు రంగం సిద్ధం!

- అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈసీ ఆదేశం
- పలువురు ఆర్డీఓలు, తహసీల్దార్లకు తప్పని స్థానచలనం
- ఇప్పటికే కొంతమందికి పదోన్నతులు కల్పించిన ప్రభుత్వం



సాక్షి, రంగారెడ్డిజిల్లా: రెవెన్యూ అధికారుల బదిలీలకు రంగం సిద్ధమైంది. మరో ఆరు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు రానుండడంతో ఏళ్ల తరబడి ఒకేచోట పాతుకుపోయిన పలువురు ఆర్డీఓలు, తహసీల్దార్లకు స్థానచలనం కల్పించాలని నిర్ణయించింది. ఈ మేరకు జూలై 31లోగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సహా కలెక్టర్లకు కేంద్ర ఎన్నికల కమిషన్ ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఆయా శాఖల అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

25 మందికి స్థానచలనం?

జిల్లాలో ఇబ్రహీంపట్నం, చేవెళ్ల, షాద్‌నగర్, కందుకూరు, రాజేంద్రనగర్ రెవెన్యూ డివిజన్లతో పాటు 27 మండల కేంద్రాలు ఉన్నాయి. ఇబ్రహీంపట్నం ఆర్డీఓ వెంకటచారి, రాజేంద్రనగర్ ఆర్డీఓ చంద్రకళ ఏళ్లుగా ఇక్కడే కొనసాగుతున్నారు. వీరితో పాటు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) తిరుపతిరావు, జిల్లా రెవెన్యూ ఆఫీసర్ (డీఆర్ఓ) హరిప్రియ సైతం ఏళ్ల తరబడి కొనసాగుతున్నారు. వీరికి ఇప్పటికే పదోన్నతులు కూడా కల్పించారు. ఏళ్ల తరబడి స్థానికంగా పాతుకుపోయిన నేపథ్యంలో 27 మండలాల పరిధిలో 25 మంది తహసీల్దార్లకు స్థానచలనం తప్పకపోవచ్చు భావిస్తున్నారు.

ముగ్గురు తహసీల్దార్లకు పదోన్నతులు

రాష్ట్ర వ్యాప్తంగా 119 అసెంబ్లీ స్థానాలు ఉండగా, వీటిలో జిల్లా పరిధిలో ఎనిమిది నియోజకవర్గాలు ఉన్నాయి. ఒక్కో నియోజక వర్గానికి ఒక్కో రిటర్నింగ్ ఆఫీసర్ (ఆర్డీఓ స్థాయి అధికారి) అవసరం ఉంది. ప్రస్తుతం 74 మంది డిప్యూటీ కలెక్టర్లు మాత్రమే ఉండగా ఈ లోటును పూడ్చేందుకు ప్రభుత్వం శనివారం 19 మంది తహసీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి కల్పించింది. వీరిలో జిల్లాకు చెందిన మాడ్గుల తహసీల్దార్ డి.దేవుజా, యూఎల్‌సీలో పని చేస్తున్న బి.శంకుతుల, కడ్తాల్ తహసీల్దార్ మురళీకృష్ణ ఉన్నారు. వీరిని సరిహద్దు జిల్లాలకు బదిలీ చేసే అవకాశం లేకపోలేదు.

పోలీసుశాఖ కసరత్తు

రాచకొండ, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ల పరిధిలో రంగారెడ్డి జిల్లా కూడా ఉంది. ఇక్కడ మొత్తం 27 పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. ఏసీపీ, సీఐ, ఎస్ఐ కేడర్ పోలీసుల్లో జిల్లాకు చెందిన వారు సైతం ఉన్నారు. మూడేళ్లకుపైగా ఒకేచోట కొనసాగుతున్న పోలీసులను కూడా ఎన్నికలకు ముందే బదిలీ చేయాలని నిర్ణయించారు. ఈ మేర కు పోలీసుశాఖ కసరత్తు చేపట్టింది.

ప్రజా రక్షణలో పోలీసుల పాత్ర కీలకం

శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి

షాద్‌నగర్‌రూరల్: శాంతి భద్రతలు ఎక్కడుంటాయో అక్కడ అభివృద్ధి ఉంటుందని శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పోలీసుశాఖ ఆధ్వర్యంలో సురక్ష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏసీపీ కుశాల్కర్ ఆధ్వర్యంలో పట్టణంలోని బుగ్గారెడ్డి గార్డెన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరైన డీసీపీ మాట్లాడారు. ప్రజారక్షణలో పోలీసుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. శాంతి భద్రతలను పరిరక్షించేందుకు పోలీసుశాఖ అనునిత్యం అప్రమత్తంగా ఉంటుందన్నారు. పెట్రోకార్, బ్లూ కోర్ట్స్, డయల్ 100, సైబర్ సెక్యూరిటీ, షీ టీమ్స్, భరోసా సెంటర్, సీసీ టీవీల ప్రాధాన్యతవంటి అనేక విభాగాలతో నేరాలను అదుపు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానంతో కేసులను త్వరితగతిన ఛేదిస్తున్నట్లు చెప్పారు. అనంతరం పోలీసు అధికారులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శంషాబాద్ ఏసీపీ భాస్కర్, సీఐలు నవీన్‌కుమార్ బాలరాజు, సత్యనారాయణ, శ్రీధర్‌కుమార్, ఎస్ఐలు వెంకటేశ్వర్లు, విజయ్‌కుమార్, దేవకి తదితరులు పాల్గొన్నారు.

చలో ప్రగతి భవన్ ర్యాలీ నేడు

లక్డీకాపూల్ : నిమ్స్ కాంట్రాక్ట్ కార్మికులకు గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ సోమవారం చలో ప్రగతి భవన్ కార్యక్రమాన్ని చేపట్టామని నిమ్స్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నరసింహ తెలిపారు. తమ సమస్యల పరిష్కారం కోరుతూ ఏప్రిల్ 17వ తేదీ నుంచి కార్మికులు పోరాటం చేస్తున్నారని చెప్పారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో నిమ్స్ యాజమాన్యం మొండి వైఖరి అవలంబిస్తోందన్నారు. దీనికి నిరసనగా చలో ప్రగతి భవన్ కార్యక్రమాన్ని తలపెట్టినట్లు ఆయన పేర్కొన్నారు. సోమవారం ఉదయం నిమ్స్ హాస్పిటల్‌లోని ఆంధ్రా బ్యాంక్ నుంచి ర్యాలీగా కార్మికులు ప్రగతి భవన్‌కు తరలివెళ్తారని, ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాల్సిందిగా నరసింహ కార్మికులకు విజ్ఞప్తి చేశారు.

వృత్తి నైపుణ్య శిక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి

అంబర్‌పేట: దేశంలో యువతకు వృత్తి నైపుణ్యంలో శిక్షణ అందించడానికి ప్రత్యేక ప్రాధాన్యమిస్తున్నట్లు కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఇప్పటివరకు 1.25 కోట్ల మందికి వృత్తి నైపుణ్య అభివృద్ధి సంస్థల సహకారంతో ఆయా రంగాల్లో శిక్షణ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఆదివారం శివం రోడ్డు విద్యానగర్‌లోని అడ్వాన్స్‌డ్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్ (ఏటీఐ) ప్రాంగణంలో మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సంస్థల సహకారంతో నిర్వహించిన మెగా జాబ్‌మేళా ముగింపు సందర్భంగా కిషన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై వివిధ సంస్థల్లో ఎంపికైన 1,300 మందికి జాబ్ ఆఫర్ లెటర్లను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అన్ని రంగాల్లో సృజనాత్మకతను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. రానున్న 25 ఏళ్లలో ప్రపంచాన్ని భారత్ శాసించేలా యువతను అన్నిరంగాల్లో తీర్చిదిద్దేందుకు ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో ప్రత్యేక కృషి చేస్తున్నట్లు చెప్పారు. జాబ్‌మేళాలో 15 వేల మంది అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకోగా 5 వేల మంది ఇంటర్వ్యూలకు ఎంపికయ్యారని, వీరిలో 1300 మంది ఆయా సంస్థల్లో ఉద్యోగాలు సాధించినట్లు కిషన్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఏటీఐ సంస్థ అధికారులు, బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావు, మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి, గద్వాల జిల్లా ఇన్‌చార్జి బి.వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్లు పద్మా వెంకట్‌రెడ్డి, అమృత, కన్నె ఉమారమేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఏం చేశారని ఉత్సవాలు?



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చల్లా నర్సింహారెడ్డి

డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి

కందుకూరు: రైతు సమస్యలు పట్టని ప్రభుత్వం ఉత్సవాలు చేసుకోవడం సిగ్గుచేటని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి విమర్శించారు. మండల కేంద్రంలో ఆదివారం పార్టీ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. తొమ్మిదిన్నరేళ్లలో 8 వేల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నందుకా వేడుకలు అని ప్రశ్నించారు. రైతుబంధు ఇస్తామని చెబుతూ మరోవైపు విత్తనాలు, ఎరువులు, పనిముట్లపై సబ్సిడీలు ఎత్తివేశారని, రుణమాఫీ చేయకుండా మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. ధాన్యం కొనుగోలు సక్రమంగా లేదని, తరుగు పేరుతో రైతుల్ని దగా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాలతో దెబ్బతిన్న పంటలకు పరిహారం ఇవ్వలేదని, రైతుల్ని కూలీలుగా, బిచ్చగాళ్లలా మారుస్తూ ఉత్సవాలు చేసుకోవడం బీఆర్ఎస్ ప్రభుత్వానికే చెల్లిందన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని, రైతులను అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. ఫార్మాసిటీ చుట్టూ 7 కిలోమీటర్ల మేర బఫర్ జోన్ విధించడంతో రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. మంత్రి సబితారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సంబురాలు మాని బఫర్ జోన్‌తో పాటు రైతుల సమస్యలు పరిష్కరించేలా చూడాలని హితువుపలికారు. సమావేశంలో మాజీ జెడ్పీఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.కృష్ణనాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజాప్రతాప్‌రెడ్డి, సీనియర్ నాయకులు జి.ప్రభాకర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కత్తుల వెంకటేశ్, జగన్, సయ్యద్ అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మాసిటీతో ప్రపంచస్థాయి గుర్తింపు



స్టేషన్ ఇన్‌చార్జిగా నియమితులైన ఎస్ఐ ప్రసాద్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

- ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి
- నక్కర్తమేడిపల్లిలో హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ ఠాణా ప్రారంభం

యాచారం: ఫార్మాసిటీతో ఈ ప్రాంతానికి ప్రపంచస్థాయి గుర్తింపు వస్తోందని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. నక్కర్తమేడిపల్లిలో హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ తాత్కాలిక పోలీస్ స్టేషన్‌ను ఆదివారం మహేశ్వరం డీసీపీ చింతమనేని శ్రీనువాస్‌రావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 19,333 ఎకరాల్లో నెలకొల్పే ఫార్మాసిటీకి 80 శాతానికి పైగా భూసేకరణ పూర్తయిందని తెలిపారు. ఫార్మాసిటీలో భాగస్వామ్యం కావడం కోసం ప్రముఖ పేరొందిన కంపెనీలు ఆసక్తి చూపుతున్నాయన్నారు. ఫార్మాసిటీ ప్రారంభమైతే లక్ష మంది స్థానికులకు ప్రత్యక్ష, పరోక్షంగా ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. చుట్టు పక్కల గ్రామాల్లోని వ్యవసాయ భూముల ధరలు మరింత పెరుగుతాయన్నారు. భూసేకరణలో ఏ రైతుకూ అన్యాయం జరగనివ్వలేదని, మీరాఖాన్‌పేటలోని హెచ్‌ఎండీఏ వెంచర్‌లో ప్లాట్లు ఇచ్చామని గుర్తు చేశారు. ప్రస్తుతం నక్కర్తమేడిపల్లిలోని అద్దె భవనంలో తాత్కాలిక పోలీస్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్నామని, త్వరలో టీఎస్ఐఐసీ సహకారంతో విశాలమైన స్థలంలో అన్ని సౌకర్యాలతో కూడిన భవనాన్ని నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. డీసీపీ చింతమనేని శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. ఒక సీఐతో పాటు, ఇద్దరు ఎస్ఐలు, పూర్తి స్థాయి సిబ్బందితో నూతన పోలీస్ స్టేషన్ సేవలు అందిస్తుందని తెలిపారు. ఫార్మాసిటీ ప్రారంభమైతే భవిష్యత్తులో ఈ ప్రాంతంలో ప్రముఖ కంపెనీల ప్రతినిధులు, ఉద్యోగులు, శాస్త్రవేత్తలు, విద్యార్థులు నివసించే అవకాశం ఉందని, వారి రక్షణే లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేకంగా ఇక్కడ పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించిందని అన్నారు. నూతన పోలీస్ స్టేషన్‌కు యాచారం సీఐ లింగయ్యతో పాటు ఎస్ఐ ప్రసాద్‌ను ఇన్‌చార్జిగా నియమించారు. కార్యక్రమంలో ఎంపీపీ కొప్పు సుకన్య, జెడ్పీటీసీ సభ్యురాలు చినోళ్ల జంగమ్మ, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ వెంకటాచారి, నక్కర్తమేడిపల్లి సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు మొరుగు శివలీల తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రణాళికతో అభివృద్ధి



రోడ్డు వెడల్పు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి సబితారెడ్డి, మేయర్ దుర్గ తదితరులు

మంత్రి సబితారెడ్డి

మీర్‌పేట: కోట్లాది రూపాయలు వెచ్చించి మీర్‌పేట కార్పొరేషన్ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నామని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. కార్పొరేషన్ పరిధిలో ఆర్‌సీఐ రోడ్డు నుంచి డీఎస్ఆర్‌కాలనీ, లలితానగర్ మీదుగా నందనవనం వరకు రూ.20 లక్షలతో చేపట్టనున్న రోడ్డు వెడల్పు పనులు, రాఘవేంద్రనగర్ నుంచి న్యూగాయత్రీనగర్ వరకు రూ.65 లక్షలతో రోడ్డు వెడల్పు, రూ.85 లక్షలతో ఆటో స్టాండ్ నుంచి క్రికెట్ గ్రౌండ్, పోస్ట్‌బాక్స్ వరకు చేపట్టనున్న రోడ్డు పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కార్పొరేషన్‌లో ప్రత్యేక ప్రణాళికతో గొలుసుకట్టు చెరువులను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే చందన చెరువును పూర్తి స్థాయిలో సుందరీకరించి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దామని, మిగతా చెరువులను త్వరలోనే అభివృద్ధి చేస్తామన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో నిధులు తెచ్చి తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక వసతులు కల్పిస్తున్నామని, దీంతో పాటు పట్టణ ప్రగతిలో భాగంగా సమీకృత మార్కెట్ పనులు చేపట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, ఫ్లోర్‌లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి, కార్పొరేటర్లు, కాలనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

మన పోలీస్.. భేష్

- మంత్రులు మహమూద్ అలీ, తలసాని
- నగరంలో ఘనంగా సురక్షా దినోత్సవం



బెలూన్లు ఎగురవేస్తున్న మంత్రులు మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్ యాదవ్ తదితరులు

కవాడిగూడ/ఖైరతాబాద్/బంజారాహిల్స్: తెలంగాణ పోలీసులకు దేశంలోనే ప్రత్యేక గుర్తింపు ఉందని మంత్రులు మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం ఉదయం ట్యాంక్‌బండ్‌పై సురక్షా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రులు మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్ యాదవ్, డీజీపీ అంజన్‌కుమార్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, దానం నాగేందర్, సినీ నటుడు నిఖిల్ పాల్గొన్నారు. రంగురంగుల బెలూన్లను ఎగురవేశారు. జెండా ఊపి వాహన ర్యాలీని ప్రారంభించారు.

ఆకట్టుకున్న ఎక్స్‌పో

రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం సమీపంలో తెలంగాణ పోలీసు శాఖ ఆధ్వర్యంలో సురక్షా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చేపట్టిన పోలీస్ ఎక్స్‌పో ఆకట్టుకుంది. రాష్ట్రంలోనే తొలిసారిగా ఏర్పాటు చేసిన ఎక్స్‌పోలో పోలీసు, ఇంటెలిజెన్స్, ట్రాఫిక్, ఫైర్, షీ టీం, సైబర్ క్రైం, బాంబ్, డాగ్ స్క్వాడ్, జైల్ శాఖతో పాటు పోలీసు శాఖలో వివిధ విభాగాల్లో ఉపయోగించే వెపన్స్‌ను ప్రదర్శించారు. బ్రాస్ బ్యాండ్, సైలెంట్ డ్రిల్, పైప్ బ్యాండ్, డాగ్ షోలతో పాటు పోలీసులు ఆపద సమయంలో తమను తాము ఎలా రక్షించుకోవాలి, దాడి చేసేందుకు వచ్చిన వారిని ఎలా ఎదుర్కోవాలనే విషయాలను ప్రదర్శించారు. ట్యాంక్‌బండ్‌పై నిర్వహించిన కార్యక్రమంలో మంత్రులు మహమూద్ అలీ, సత్యవతి రాథోడ్, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, సినీనటుడు నాని, క్రీడాకారిణి నైనా జైస్వాల్, డీజీపీ అంజనీకుమార్, పోలీస్ కమిషనర్లు సీవీ ఆనంద్, స్టీఫెన్ రవీంద్ర, డీఎస్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు. బంజారాహిల్స్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ వద్ద సురక్ష దినోత్సవాలు ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఎల్బీనగర్, చార్మినార్ తదితర ప్రాంతాల్లో సురక్షా దినోత్సవాన్ని ఘనంగా చేపట్టారు.

డ్రగ్ పెడ్లర్లలో దడ!

- స్టడీ, టూరిస్ట్, మెడికల్ వీసాలపై వచ్చి నైజీరియన్ల డ్రగ్స్ దందా
- గోవా, ముంబై కేంద్రంగా మాదక ద్రవ్యాల సరఫరా
- గాలమేసి నగరానికి రప్పిస్తున్న పోలీసులు
- రాగానే రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: నైజీరియా డ్రగ్ పెడ్లర్లపై పోలీసుల నిఘా పెరిగింది. హైదరాబాద్‌కు వస్తే అరెస్టు లేకపోతే పీడీ యాక్ట్ నమోదు చేస్తుండటంతో పెడ్లర్లలో భయం పెరిగింది. గోవా కేంద్రంగా డ్రగ్స్ దందా నడిపిస్తున్న ఎడ్విన్ నూన్స్‌ను హైదరాబాద్ కమిషనరేట్ పోలీసులు అరెస్టు చేసి, పీడీ యాక్ట్ నమోదు చేయగా..రాచకొండ, సైబరాబాద్ పోలీసులూ పలువురు నైజీరియన్ పెడ్లర్లను ఎరవేసి సిటీకీ రప్పించి మరీ కటకటాల్లోకి తోశారు. ఇటీవల కాలంలో ట్రై కమిషనరేట్ పోలీసులు నైజీరియాకు చెందిన చకుమేకా, ఎన్నుచుక్వు గాడ్విన్ ఇఫెనీ, ఓజెంగ్వా ఇమ్మాన్యుయేల్ ఒసోండు, మహమ్మద్ తోయిరు బకారి, విక్టర్ చుక్వా, ఒజిగ్బో తోచుక్వు, ఒబిబులు చిమ డార్లింగ్‌టన్, చిజియోకో ఉచెచుక్వి అలియాస్ పీటర్‌లను వరుసగా అరెస్టు చేశారు.

వీసా గడువు ముగిసినా...

విద్య, వ్యాపారం పేరుతో మన దేశానికి వచ్చిన నైజీరియన్లు వీసా గడువు ముగిసిన తర్వాత కూడా అక్రమంగా ఉంటూ జీవనోపాధి కోసం డ్రగ్స్ దందా చేస్తున్నారు. పోలీసుల కళ్లుగప్పుతూ గోవా, ముంబై, బెంగళూరు వంటి మెట్రో నగరాలలో మకాం మారుస్తూ..ఎండీఎంఏ, హెరాయిన్, కొకైన్ వంటి డ్రగ్స్‌ను సరఫరా చేస్తున్నారు. నాలుగైదు ఏళ్ల క్రితం నైజీరియన్లే భౌతికంగా హైదరాబాద్‌కు వచ్చి డ్రగ్స్‌ను సరఫరా చేసేవారని, అయితే ప్రస్తుతం తెలంగాణలో డ్రగ్స్ సరఫరాపై పోలీసుల నిఘా పెరగడంతో రాష్ట్రానికి రావాలంటే పునరాలోచనలో పడిపోయారని ఎల్బీనగర్ స్పెషల్ ఆపరేషన్ టీం పోలీసు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

బండ కింద, చెట్టు తొర్రల్లో డ్రగ్స్..

హైదరాబాద్ పోలీసుల భయంతో నైజీరియన్ డ్రగ్ పెడ్లర్లు ఇక్కడికి నేరుగా రావడం మానేశారని, కింది స్థాయి సరఫరాదారులను పంపిస్తూ వ్యాపారం కొనసాగిస్తున్నారని ఓ పోలీస్ అధికారి చెప్పారు. మరి అంతగా సరుకు కావాలంటే గోవాకు రమ్మని సూచిస్తున్నారు. అక్కడికి వెళ్తే కూడా భౌతికంగా వచ్చి సరుకు డెలివరీ చేయడం లేదు. ఫలానా ప్రాంతంలో డబ్బు పెట్టి వెళ్లిపోతే..మరో చోట బండ కిందనో, చెట్టు తొర్రల్లోనే, చెత్త బుట్టల్లోనే డ్రగ్స్ ప్యాకెట్ ఉంటుంది తీసుకొని వెళ్లిపోమని చెబుతున్నారని ఆయన వివరించారు.

టవర్ లొకేషన్ చిక్కకుండా..

బిక్షగాళ్లు, అనాథల నుంచి ఆధార్, ఓటర్ కార్డులు తీసుకొని వారి పేరుతో బ్యాంకు ఖాతాలను తెరుస్తున్నారు. ఈ అకౌంట్ల ఏటీఎం కార్డులను నేరస్తులు వినియోగిస్తున్నారు. ఇటీవల అరెస్టయిన పలువురు నైజీరియన్ డ్రగ్ పెడ్లర్ల విచారణలో ఇదే తేలింది. జార్ఖండ్, ఉత్తర్ ప్రదేశ్, బీహార్ వంటి ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన సైబర్ నేరస్తులు బ్యాంకు ఖాతాలను డ్రగ్ పెడ్లర్లకు అందిస్తున్నారని పోలీసుల విచారణలో తేలింది. స్నాప్ చాట్, వాట్సాప్‌లలో డ్రగ్స్ ఆర్డర్లు తీసుకుంటారని, సెల్‌ఫోన్ కాల్ అయితే టవర్ లొకేషన్ ఆధారంగా పోలీసులు పట్టేస్తారని వీఓఐపీ కాల్స్‌లో మాట్లాడుతున్నారని వివరించారు.

క్లుప్తంగా

ఆటో డ్రైవర్లకు అండగా ప్రభుత్వం



ఆటో యూనియన్ సభ్యులతో జనార్దన్

పహాడీషరీఫ్: జల్‌పల్లి ఆటో యూనియన్‌కు మంత్రి సబితా ఇంద్రారెడ్డి అండగా ఉంటారని బీఆర్‌ఎస్ మున్సిపాలిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జనార్దన్ తెలిపారు. గ్రామంలోని 16వ వార్డులో ఆదివారం ఏర్పాటు చేసిన ఆటో కార్మిక సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. జల్‌పల్లి నుంచి ప్రయాణికులను ఏళ్ల తరబడిగా ఆటో డ్రైవర్లు మైలార్‌దేవ్‌పల్లి తీసుకెళుతున్నారన్నారు. ఈ విషయంలో లక్ష్మీగూడ, మైలార్‌దేవ్‌పల్లి ఆటోడ్రైవర్లు జల్‌పల్లి డ్రైవర్లపై దాడికి పాల్పడడం సరైంది కాదన్నారు. ఈ విషయంపై పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు.ఆటోవాలాల సమస్యలను మంత్రి సబితారెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఆదుకునేలా చూస్తామన్నారు.కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ఇద్రీస్, మహ్మద్ సాదిక్,యూనియన్ నాయకులు అమీన్, షర్ఫూ, అబ్దుల్, మల్లేష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

షాబాద్: బైక్ అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో బైక్ వెనుక కూర్చున్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా బైక్ నడిపిన వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. సీఐ గురువయ్యగౌడ్ తెలిపిన ప్రకారం వివరాలు.. షాబాద్‌కు చెందిన అంజాద్(35), టీ శేఖర్(40) బైక్‌పై షాబాద్‌లోని హరిజనవాడ నుంచి గ్రామానికి వస్తుండగా వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో శేఖర్ అక్కడికక్కడే మృతి చెందాడు. అంజాద్‌కు తీవ్ర గాయాలు కావడంతో ఉస్మానియాకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అక్షర దోషాలకు విద్యార్థులదే బాధ్యత

- ఈఏఎఫ్‌లో జాగ్రత్తలు పాటించండి
- ఓయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్స్ ప్రొ.రాములు



ఓయూ కంట్రోలర్ ప్రొ.రాములు

ఉస్మానియా యూనివర్సిటీ: సర్టిఫికెట్లలో దొర్లే అక్షర దోషాలకు (స్పెల్లింగ్ మిస్టేక్స్) విద్యార్థులు, కళాశాల సిబ్బంది బాధ్యులని ఓయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొ.రాములు తెలిపారు. ఆదివారం ఆయన ఇక్కడ ‘సాక్షి’తో మాట్లాడుతూ ఈఏఎఫ్ (ఎగ్జామ్ అప్లికేషన్ ఫామ్)ను పూరించేటప్పుడు ఒకటికి రెండుసార్లు సరిచూసుకోవాలన్నారు. సర్టిఫికెట్ల జారీకి ఆన్‌లైన్ దరఖాస్తుల విధానం కొనసాగుతున్నందున ఎగ్జామినేషన్ బ్రాంచ్‌లో తప్పిదాలకు తావులేదన్నారు. ఈఏఎఫ్‌ను పూర్తి చేసేటప్పుడు విద్యార్థి పేరు, ఇంటిపేరు, తల్లిదండ్రుల పేర్లను తప్పులు లేకుండా రాయాలన్నారు. హడావుడిగా ఈఏఎఫ్‌ను పూర్తి చేస్తే అక్షర దోషాలకు అవకాశం ఉందన్నారు. సర్టిఫికెట్లలో తప్పిదాలకు ఓయూ ఎగ్జామినేషన్ బ్రాంచ్‌కు ఎలాంటి సంబంధం లేదని, ఇక్కడ పెన్నుపెట్టి రాసేవిధానం లేదన్నారు. ఈఏఎఫ్‌లో ఏదైతే రాస్తారో అదే సర్టిఫికెట్‌లో ప్రింట్ అవుతుందన్నారు. త్వరలో అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్ (ఏబీసీ), డిజిటల్ లాకర్ విధానాన్ని ప్రవేశపెడుతున్నట్లు ప్రొ.రాములు చెప్పారు. ఈ విధానంతో విద్యార్థి తన సర్టిఫికెట్లను ప్రపంచంలో ఎక్కడైనా వెరిఫికేషన్ చేసుకోవచ్చన్నారు.

హుండీలో డబ్బు చోరీ

హయత్‌నగర్: ఆలయ హుండీలోని డబ్బులను గుర్తుతెలియని వ్యక్తులు దోచుకెళ్లిన సంఘటన ఆదివారం తెల్లవారుజామున హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేర కు.. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కుంట్లూర్‌లోని ఇష్టకామేశ్వరి ఆలయ గోడ దూకి లోపలికి చొరబడిన దుండగుడు హుండీలోని డబ్బులను దోచుకెళ్లారు. హుండీలో సుమారు రూ. 25వేలు ఉండవచ్చని స్థానికులు తెలిపారు. ఆదివారం ఉదయం పూజారి గుడి తలుపులు తెరచి చూడగా హుండీ తలకిందులుగా పడి ఉంది. అనుమానం వచ్చిన ఆయన ఆలయ కమిటీ సభ్యులకు సమాచారం అందించాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా దొంగను గుర్తించే పనిలో ఉన్నారు.

గీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న రవికుమార్ గౌడ్

- రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్

ఇబ్రహీంపట్నం రూరల్: గీత కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఆదిబట్లకు చెందిన బీ శంకరయ్యగౌడ్ అనే గీత కార్మికుడు ఇటీవల తాటి చెట్టు మీద నుంచి పడి మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఆయన బాధిత కుటుంబానికి తక్షణ ఆర్థిక సాయంగా కల్లుగీత కార్పొరేషన్ నుంచి రూ.25 వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. కల్లు గీత వృత్తిలో ప్రమాదాలు జరగకుండా నివారించేందుకు సేఫ్టీ మోకులు అందజేసేలా ప్రయత్నిస్తున్నామని తెలిపారు. కుల వృత్తుల సంక్షేమానికి ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేపడుతోందని చెప్పారు. గీత కార్మికులను మరింత వృద్ధిలోకి తేవడానికి నీరా కేంద్రాలు ఏర్పాటు చేస్తోందని వివరించారు. గౌడల అభ్యున్నతికి మద్యం దుకాణాల కేటాయింపుల్లో 15 శాతం రిజర్వేషన్లు కల్పించడం జరిగిందన్నారు. ప్రమాదానికి గురై మృతి చెందిన గీత కార్మికులను ఆదుకునేందుకు గీతన్న బీమా ద్వారా ప్రభుత్వం రూ. 5లక్షల ఆర్థిక సహాయం అందివ్వడానికి కార్యాచరణ సిద్ధం చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఆదిబట్ల మున్సిపాలిటీ కోఆప్షన్ సభ్యులు గోపాల్‌గౌడ్, మాజీ సర్పంచ్ శేఖర్‌గౌడ్, ఇబ్రహీంపట్నం మండల ప్రజాపరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు అశోక్‌గౌడ్, కల్లు గీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్ గౌడ్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, స్థానిక సొసైటీ అధ్యక్షుడు యాదయ్య గౌడ్, నాయకులు సత్తయ్య గౌడ్, అంజయ్య, నరేష్, అంజయ్య, మోహన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ పోటీల్లో సమీక్షారెడ్డి ప్రతిభ



సమీక్షారెడ్డిని అభినందిస్తున్న కోచ్ తదితరులు

మణికొండ: క్రీడల్లో రాణించేందుకు ఉత్తమ శిక్షణతో పాటు పట్టుదల ఎంతో ముఖ్యమని సీనియర్ కోచ్ గోవర్ధన్‌రెడ్డి వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2023లో భాగంగా అండర్-17 బాలికల సింగిల్స్ విభాగంలో కొండకళ్ల సమీక్షా రెడ్డి ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ మేరకు ఆదివారం మణికొండలో ఆమెను అభినందించారు. ఈ సందర్భంగా కోచ్ గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ మణికొండ ప్రాంతానికి చెందిన మధుసూదన్‌రెడ్డి కుమార్తె సమీక్షా రెడ్డి బ్యాడ్మింటన్ పోటీల్లో తనసత్తా చాటుతోందన్నారు. ఏ పోటీలు జరిగినా ఉత్తమ ప్రదర్శన కనబరుస్తోందని అభినందించారు. భవిష్యత్‌లో భారతదేశం తర పున ఆడే విధంగా తీర్చిదిద్దుతున్నామన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

MULTIMEDIA

■ఉచిత శిక్షణ: 1,50,000/- విలువ గల Multi medias Animation Govt. Quota, 20 అడ్మిషన్లు ఉచితం+ Reimbursement + 100% Jobs. Mobile Repair Course, CC Camera Training. Hyderabad. ఫోన్ : 9542606074 [H-781700]

Real Estate

■2,999/-కే గజం యాదాద్రి, జనగాం (జిల్లా) దగ్గర న్యూవెంచర్‌లో 121, 242, 605 గII సైజు ప్లాట్స్ అమ్మబడును. క్లియర్ టైటిల్, స్పాట్ రిజిస్ట్రేషన్. ఫోన్ : 8309376230. [H-781219]

FLAT FOR SALE

■Charlapally, Ready to Occupy 3BHK 1620 Sft. Flats Gated Community, Club House, Swimming Pool, No GST, Must See, Call : 9492427519 [H-780809]

PLOT FOR SALE

■బెంగళూర్ హైవే, షాద్‌నగర్ టౌన్ కి దగ్గర్లో కమ్మదనం విలేజ్ లో DTCP అప్రూవ్డ్ రెడీ ఫర్ కన్‌స్ట్రక్షన్ తో 147 గII ఓపెన్ ప్లాట్స్, క్లియర్ టైటిల్, స్పాట్ రిజిII, బ్యాంక్ లోన్ సౌకర్యం, ఫ్రీ సైట్ విజిట్. ఫోన్ : 9000378124 [H-780806]

■బెంగళూరు హైవే, షాద్ నగర్ @ రాజాపూర్ ప్రైమ్ లోకేషన్‌లో 124 ఎకరాల మెగా ఫాం ల్యాండ్ & ప్రకృతి వైద్యశాల అతితక్కువ ధరలో బైబ్యాక్ ఆఫర్ కలదు. ఫోన్ : 8121400661. [HA-10907]

■బెంగుళూరు హైవే @ రాజాపూర్ దగ్గర ప్రైమ్ లోకేషన్ నందు 124 ఎకరాల మెగా ఫ్రూట్స్ ఫాంల్యాండ్ అందమైన వెంచర్‌లో 2 మరియు 5 గుంటల ప్లాట్లు కలవు. బైబ్యాక్ ఆఫర్ కలదు. సంప్రః 96666 95886 [G-3083]

■VJA, బెంజిసర్కిల్‌కి 5 కి.మీ. గన్నవరం, బందరు రోడ్డు, కంచికచర్ల దగ్గర శ్రీగంధం మొక్కలతో ఇళ్ళ ప్లాట్స్ చIIగII 1,900/-, నుండి 17,500. సంప్ర : ✆ 93906 65999 [B-44]

VILLAS FOR SALE

■New-age design premium villas for sale in Raviryala for just Rs.1.80 Crores. Contact: +91 7353585358 Sark Projects [HA-93587]

Services

BUSINESS SERVICE

■మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును Ph: 9100329739 [H-797533]

BUSINESS OFFER

■ బాలక్రిష్ణ జ్యూవెల్లర్స్ బంగారం వస్తువులు ఆర్డర్‌పై చేయబడును. బంగారం పై అప్పు ఇప్పించబడును. షరతులు వర్తిస్తాయి. క్రెడిట్‌కార్డ్ స్వైప్ చేయబడును. Ph: 9704517420 [H-780861]

■Wanted Investor for a Chain of Restaurants Good Returns Guaranteed. Contact: 6309824365 [HA-14649]

PERSONAL CARE

CHANGE OF NAME

■I, Ambika R/o. Block 7-1604, My Home Vihanga, Gachibowli, hyderabad, Pin-500032. have changed my name to Ambika Sharma D/o. Ramesh Kumar Sharma for all Future purposes. [HA-29591]

Wanted

■ అమీర్‌పేట్ ప్రముఖ రియల్ ఎస్టేట్ కంII లో పనిచేII ఫార్మ్‌ల్యాండ్ లో అనుభవం గల (M/F) మార్కెటింగ్ చే & టెలికాలర్స్ కాII మంచి జీతం: 10-50K + కమీషన్. ఫోన్ : 7842161232. [H-780813]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ:18K. ఏజెంట్ కమీషన్. 6K. Ph: 9963114535/ 7287061111 [H-793435]

■ యువతీ యువకులకు అద్భుత అవకాశం. ప్రముఖ కార్పొరేట్ కంIIలో వర్క్ చేII లేడీ రిసెప్షనిస్ట్+టెలికాలర్స్, (M) ఫీల్డ్ ఆఫీసర్స్ కాII నో టార్గెట్, ఫిక్స్‌డ్ శాలరీ, Age: 18-35Yrs. Qly: 10th-Degree. ఫోన్ :9618831719 [H-780807]

■ అర్జెంటుగా సెక్యూరిటీ గార్డ్స్, ఫీల్డ్ ఆఫీసర్స్ & అకౌంటెంట్, RTC కార్గో అటెండర్స్ కావలెను. సంప్రదించండి: 9392663777, 9030001313, 9246663777 [HA-1335]

■ సిట్టింగ్ జాబ్స్, టెలికాలర్స్, రిసెప్షనిస్ట్, వీడియో ఎడిటింగ్, కలెక్షన్, మార్కెటింగ్ స్టాఫ్, డ్రైవర్లు, హెల్పర్లు, సూ వైజర్స్, ఆయాలు, వర్కర్లు జీ: 10-20K+ ఫ్రీ హాస్టల్@9505261777 (ఫీజు లేదు) [H-797645]

■ టిఫిన్ సెంటర్‌లో పనిచేయుటకు స్టాల్ బాయ్స్, టీ మాస్టర్ కావలెను. ఇక్కడే ఉండి చేసుకునే వారికి జీతం+ భోజనం వసతి కలదు. ఫోన్: 9652134626, 9666934949 [H-792890]

■నేత్ర హోంకేర్ సర్వీసెస్: హైదరాబాదు లో పెద్దవారికి, వృద్ధులకు సేవ చేయుటకు బేబీకేర్, ఇంటి/ వంటపనికి స్త్రీ/పుII కావలెను. జీతం: 16000 - 25000 రూం+భోజనం ఫ్రీ. 9676917002, 9908912806 [G-803]

■ ప్రముఖ కంపెనీ నందు మీ ఇంటి వద్దనే ఉండి పార్ట్ టైమ్/ఫుల్‌టైమ్ పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలయును. జీతం: 15000+ ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 8341371684 [G-786390]

■ Wanted Exp Business Development Managers M/F And Field Officers for a Reputed House keeping/ Security Company located @Balanagar. 9000239575/ 9908881122 [H-781381]

■ Wanted Female Telecallers Qualification 10th to Degree. No Consultancy, Direct job, Fixed Salary. Address : Ameerpet. Contact: 7075239265 [HA-11223]

■ Wanted HR Min Exp 3years M/F F/T to work in Reputed Jewellery Showroom in Jubilee Hills Walk in Interview Ph : 9912525467. [HA-11224]

■ Work from home in Corporate Co., Retd. / VRS, Housewifes, Employees, Unemployees M/F, P/F Time, Age: 35+ only. Ph :7013794440 [HA-93564]

■ Req. M/F Office Assistant with Computer Knowledge (12-15K) only 5 days a week Below 35yrs Share Market Consultancy. Moula-Ali, H.B. Colony. Ph: 9246339524 [H-797499]

■ Wanted Salesmen & Marketing in Textiles Wholesale Shop. Auto Driver, Helpers, Lady Accountant. Ph: 9391644112. [HA-11217]

FACULTY TEACHERS

■ Wanted Female Teachers With Good Communication Skills For Nursery To 2nd Class At Bachpan Moosapet Call: 7989400638, 9642325438 [H-797481]

■ Krishnaveni Talent High School, Req: Experienced Teachers for all the Subjects from VI to X Class. Ph : 9640413300, 9866272235 [HA-11220]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు జోన్ సెంటర్స్

క్లాసిఫైడ్స్ 3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9912225475	కూకట్‌పల్లి	9912225476
తార్నాక	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజ్‌గిరి	9505507562
చిక్కడపల్లి	9010188892	మెహదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9010213322
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	7095250115

వివరాలకు : 6-2-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం. 1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34 Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453

అంతర్జాతీయ పోటీల్లో రాణించాలి

- మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్
- వెల్జాల్‌లో ముగిసిన రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న శ్రీనివాస్‌యాదవ్

తలకొండపల్లి: క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో రాణించాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీపీ శ్రీనివాస్ యాదవ్ అన్నారు. రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ, జిల్లా అసోసియేషన్ సభ్యుల సౌజన్యంతో వెల్జాల్‌లో నిర్వహించిన 7వ సీనియర్ రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ ఛాంపియన్ షిప్ 2023-24 పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ పోటీల్లో 22 జిల్లాల క్రీడాకారులు పాల్గొన్నారు. గెలుపొందిన క్రీడాకారులు ఈనెల 16 నుంచి 20 వరకు తమిళనాడు రాష్ట్రంలోని మధురైలో జరుగనున్న జాతీయస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొననున్నారని పీఈటీ మల్లేశ్ తెలిపారు. ఈ సందర్భంగా విజేతలకు శ్రీనివాస్‌యాదవ్ షీల్డ్, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. పురుష విభాగంలో మొదటి బహు మతి ప్రవీణ్(హైదరాబాద్), ద్వితీయ బహు మతి తేజరాజు(హైదరాబాద్).. మహిళా విభాగంలో మొదటి బహుమతి త్రిష(నిజామాబాద్), ద్వితీయ బహుమతి నవనీత(నిజామాబాద్) కైవసం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం జగదీశ్వర్, సర్పంచ్ సంగీత, ఉపసర్పంచ్ అజీజ్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసమూర్తి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ.ముజీబర్ రహ్మాన్, రాష్ట్ర కార్యదర్శి శ్యామ్‌సుందర్, జిల్లా ప్రధన కార్యదర్శి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ యువజన విభాగం కార్యనిర్వాహక అధ్యక్షుడిగా అర్జున్



అర్జున్‌కు నియామక పత్రం అందజేస్తున్న సబిత

పహాడీషరీఫ్: బీఆర్‌ఎస్ జల్‌పల్లి మున్సిపాలిటీ యువజన విభాగం కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఎం అర్జున్ నియమితులయ్యారు. మంత్రి సబితారెడ్డి ఆదివారం ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు.అనంతరం ఆమె మాట్లాడుతూ..ఏ పార్టీలోనైనా యువతదే కీలక పాత్ర ఉంటుందన్నారు. అందులో భాగంగానే యువతను ఏకతాటిపైకి తీసుకొచ్చి పార్టీ పటిష్టం కోసం పాటుపడుతాడన్న నమ్మకంతో అర్జున్‌కు ఈ పదవి అప్పగించడం జరిగిందన్నారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయం కోసం యువతను కలుపుకొని తన వంతుగా కృషి చేస్తానని అర్జున్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కో-ఆప్షన్ మెంబర్ సూరెడ్డి కృష్ణారెడ్డి, నాయకులు కే వాసుబాబు, చంద్రం చారి, పరమేశం, జగన్‌రాజు, సిద్దు, ఇద్రీస్, అను తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే అధికారం



కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

- పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్

కడ్తాల్: వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని పీసీసీ సభ్యుడు ఏ శ్రీనివాస్‌గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో ఆదివారం ఎఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ..పేద ప్రజలకు అండగా ఉండేది ఒక్క కాంగ్రెస్ పార్టీయేనని గుర్తు చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ అవినీతి అక్రమాలను ఎప్పటికప్పుడు ప్రజాక్షేత్రంలోకి తీసుకువెళ్లి ఎండగట్టాలని కార్యకర్తలకు సూచించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో రాగానే రైతులకు ఏకకాలంలో రూ. 2లక్షల రుణమాఫీ, రూ.500కే వంట గ్యాస్ సిలిండరు, ఆరోగ్య శ్రీ అమలు, నిరుద్యోగ భృతి నెలకు రూ.4 వేలు, అర్హులైన పేదలకు రూ.5లక్షలతో ఇంటి నిర్మాణం చేపట్టనుందని తెలిపారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఏ నర్సింహ, పార్టీ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా,సర్పంచ్‌లు విఠలయ్య గౌడ్, సేవ్యానాయక్, నాయకులు రమేష్, జనార్దన్, శ్రీను, లక్ష్మయ్య, రవి, మల్లయ్య, రాజేందర్, ఇమ్రాన్, మల్లేశ్‌గౌడ్, యాదయ్య, హీరాసింగ్, తులసీరాం పాల్గొన్నారు.

సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కొడంగల్ రూరల్: అక్షరం, ఆరోగ్యం, ఆర్థిక స్థితిగతులకు ప్రాధాన్యత ఇస్తూ సమాజంలో గౌరవప్రదంగా జీవించేందుకు కృషిచేయాలని తెలంగాణ బీసీ కమిషన్ మెంబర్ ఎస్ శుభప్రద్‌పటేల్, పిలుపునిచ్చారు. పీసీసీ అధికార ప్రతినిధి పామెనా భీమ్ భరత్, జెడ్పీ వైస్ చైర్మ న్ బైండ్ల విజయకుమార్, పాలమూరు ఉస్మానియా యూనివర్శిటీ వక్తలు ప్రొఫెసర్ డాక్టర్ పి.శివకుమార్‌సింగ్, డాక్టర్ ఉదయభాను పాల్గొన్నారు. ఆదివారం పట్టణంలోని కేఎస్‌వీ ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను పురష్కరించుకొని తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక అధ్యక్షుడు ఏ శ్రీనివాస్ అధ్యక్షతన 10వ తరగతి, ఇంటర్, ఆపై తరగతుల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు మెమెంటోలు, మహనీయుల జీవిత చరిత్ర పుస్తకాలను అందజేశారు. విద్యార్థి దశ ఎంతో కీలకమైందని, ప్రతీ విద్యార్థి సమయాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం

తాండూరు టౌన్: శాంతి భద్రతల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో సురక్షా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని గుండుపీర్ల వద్ద యువతకు వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. తాండూరు డీఎస్పీ శేఖర్‌గౌడ్ మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో నేరాల అదుపు కోసం పోలీసు శాఖ నిరంతరం శ్రమిస్తోందన్నారు. ఫ్రెండ్లీ పోలీసు వ్యవస్థతో ప్రజల సమస్యలను తీరుస్తున్నామన్నారు. ట్రాఫిక్ నియమాలు, సైబర్ నేరాలు, డయల్ 100, షీటీంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. పట్టణ సీఐ రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. సురక్షా దినోత్సవంలో భాగంగా యువతకు వాలీబాల్ పోటీలు నిర్వహించామన్నారు. ఆరు జట్లు పాల్గొనగా ఫైనల్‌లో మంబాపూర్ జట్టు, సాయినగర్ జట్టుపై విజయం సాధించిందన్నారు.



తాండూరుటౌన్: వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

నేడు మోకిల పోలీస్‌స్టేషన్ ప్రారంభం



మోకిల పోలీస్ స్టేషన్

శంకర్‌పల్లి: మండలంలోని మోకిల పోలీస్‌స్టేషన్‌ను సోమవారం అందుబాటులోకి తేనున్నారు. ఈ స్టేషన్‌కు సీఐ నరేష్‌ను నియమిస్తూ మే 7న సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర ఉత్తర్వులు జారీ చేశారు. శంకర్‌పల్లి - హైదరాబాద్ ప్రధాన రహదారిలో అందరికి అందుబాటులో ఉండేలా ఓ ప్రైవేటు భవనంలో పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. సీఐతో పాటు 20మంది సిబ్బందిని, పెట్రోలింగ్ వాహనంతో పాటు రెండు బైక్‌లు కేటాయించారు. ఈ పోలీస్ స్టేషన్ పరిధిలో మొత్తం 14 గ్రామాలు ఉన్నాయి. శంషాబాద్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి, నార్సింగి ఏసీపీ రమణగౌడ్ ఆధ్వర్యంలో సోమవారం మధ్యాహ్నం పోలీస్ స్టేషన్ ప్రారంభించనున్నారు. కొత్త పోలీస్ స్టేషన్ పరిధిలోకి దొంతాన్‌పల్లి, పొన్నగుట్ట తండా, పిల్లిగుండ్ల, గోపులారం, కొండకల్, కొండకల్ తండా, శేరిగూడ, మహారాజ్ పేట్, ఇరుకుంట తండా, కాకర్లగుట తండా, మోకిల, మోకిల తండా, ప్రొద్దటూరు, టంగటూరు గ్రామాలు రానున్నాయి.

బ్రిజ్‌భూషణ్ శరణ్‌సింగ్‌ను వెంటనే అరెస్టు చేయాలి

యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకటయ్య



ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

షాద్‌నగర్‌రూరల్: భారత మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు, పార్లమెంట్ సభ్యుడు బ్రిజ్‌భూషణ్ శరణ్‌సింగ్‌ను వెంటనే అరెస్టు చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకటయ్య డిమాండ్ చేశారు. ఢిల్లీలో భారత రెజ్లర్లు చేస్తున్న పోరాటానికి మద్దతుగా ఆదివారం టీఎస్ యూఎఫ్, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం నుంచి ప్రధాన కూడలి వరకు సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత రెజ్లర్ల సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ శరణ్‌సింగ్ మాపై లైంగికంగా దాడికి పాల్పడ్డాడని, తాకరాని చోట తాకాడని భారత రెజ్లర్లు వినేష్ పొగాట్, సాక్షిమాలిక్‌లు గత కొంత కాలంగా దేశ రాజధాని ఢిల్లీలో పోరాటాం చేస్తున్నారని అన్నారు. బాధిత రెజ్లర్లకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు శివారెడ్డి, నర్సింలు, శ్యామలాదేవి, ప్రజా సంఘాల నాయకులు టీజీ శ్రీనివాస్, తిరుమలయ్య,రవీంద్రనాథ్, కృష్ణ, బాలయ్య, చంద్రశేఖర్, సురేందర్, నర్సింలు, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.